సంక్రాంతి సంబురాల్లో భాగంగా ఆదివారం జూబ్లీహిల్స్‌లోని ఓ స్టోర్ ముందు ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు

ఇంటింటా భోగి సంబురాలు

• కేబీఆర్ పార్కువద్ద ఘనంగా భోగి వేడుకలు

బంజారాహిల్స్, జనవరి 14: భారత జాగృతి ఆధ్వర్యంలో భోగి పండుగ వేడుకలు ఆదివారం తెల్లవారు జామున బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు వద్ద ఘనంగా నిర్వహించారు. రంగురంగుల ముగ్గులు, హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల విన్యాసాలతో కేబీఆర్ పార్కువద్ద గ్రామీణ వాతావరణంతో పాటు పండుగ సందడి కనిపించింది. అనంతరం భారత జాగృతి కార్యకర్తలు భోగిమంటలు వెలిగించి సందడి చేశారు. జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు వరలక్ష్మి, కువైట్ అధ్యక్షుడు ఉదయ్, జిల్లా అధ్యక్షుడు నరేందర్, యూత్ అధ్యక్షుడు శ్రీనివాస్, సంతోశ్, శ్రీకాంత్, మహేశ్‌యాదవ్, తేజ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ కుటుంబ సమేతంగా శ్రీలక్షమోదక వరసిద్ధి వినాయక చండీ రుద్ర హోమం నిర్వహించారు. గత ఆరు రోజులుగా నిర్వహిస్తున్న ఈ పూజల్లో చివరిరోజు ఆదివారం ఎమ్మెల్యే గోమాత పూజలు చేపట్టి పూర్ణాహుతితో వేద పండితుల ఆశీర్వాదం తీసుకున్నారు. – జూబ్లీహిల్స్, జనవరి14

వైభవంగా గోదాదేవి కల్యాణం

నారాయణగూడ భూలక్ష్మి ఆలయంలో పూజలు చేస్తున్న కార్పొరేటర్ విజయారెడ్డి

హిమాయత్‌నగర్ : ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నారాయణగూడలోని శ్రీశ్రీశ్రీ భూలక్ష్మి దుర్గాదేవి ఆలయంలో ఘనంగా గోదాదేవి కల్యాణ మహోత్సవాలు వైభవంగా జరిగాయి. ఆలయ ప్రాంగణంలో అమ్మ వారిని పట్టు వస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలకరించి, వేదపండితుల మంత్రోచ్చరణాలు, బాజా భజంత్రీల మధ్య కల్యాణోత్సవం జరిగింది. ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి గోదాదేవి కల్యాణ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం అన్నసంతార్పణ జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు సయ్యద్ జావీద్, జ్ఞానే శ్వర్, దిలీప్‌రాజ్‌రెడ్డి, కమల, హాజీ, సంధ్యారాణి, కిరణ్, శివ, ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎన్.రాజేంద్రప్రసాద్ ముదిరాజ్, బీఆర్ఎస్ నాయకురాలు ఐలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఓం శ్రీనివాసాయ మంగళం

మైలార్‌దేవ్‌పల్లి : ఓం శ్రీనివాసాయ మంగళం అంటూ... టీఎన్‌జీవోస్ కాలనీలోని వేంకటేశ్వర స్వామి దేవాలయం మారుమ్రోగింది. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ టీఎన్‌జీవోస్ కాలనీలోని శ్రీవెంకన్నగుట్ట కలియుగ ప్రత్యేక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. గత నెల రోజుల పాటు కొనసాగిన ధనుర్మాసోత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించిన శ్రీ భూనీలా సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో గోదా రంగనాథ కల్యాణ మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. దేవాలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వహకులు తగు ఏర్పాటు చేశారు.

ఖైరతాబాద్ నియోజకవర్గంలో..

బంజారాహిల్స్ : ఖైరతాబాద్ నియోజకవర్గంలో ధనుర్మాస ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం వైష్ణవ ఆలయాల్లో శ్రీ గోదాదేవి కల్యాణం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వేంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, హిమాయత్‌నగర్ డివిజన్లలోని ఆలయాలతో పాటు కాలనీల్లో గోదా కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. శ్రీనగర్ కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయం, ఫిలింనగర్ దైవసన్నిధానంలో శ్రీ గోదాదేవి కల్యాణోత్సవాన్ని కమనీయంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు వద్ద భోగి మంటలు కార్యక్రమంలో పాల్గొన్న భారత జాగృతి నాయకులు

టీఎన్‌జీవోస్ కాలనీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారిని కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

సంక్రాంతి పండుగకు స్వాగతం

మైలార్‌దేవ్‌పల్లి, జనవరి 14: రాజేంద్రనగర్ నియోజకవర్గంలో సంక్రాంతి శోభను సంతరించుకుంది. మొదటి రోజు భోగి సందర్భంగా తెల్లవారుజామునే ప్రజలు ఇళ్ల ముందు భోగి మంటలు వేసి, మహిళలు ఇంటి ముందు రంగురంగుల రంగవళ్లులను తీర్చిదిద్ది సంక్రాంతి పండుగకు స్వాగతం పలికారు. చిన్నపెద్దలు వాడవాడల భవనాలపై పతంగులు ఎగరవేస్తూ కేరింతలు కోడుతూ డీజే పాటలతో నృత్యాలు చేశారు.

భోగి సంబురాల్లో జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య సిబ్బంది

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

హిమాయత్‌నగర్, జనవరి14: సమాజంలోని ప్రతి పౌరుడు జీవన విధానంలో పరిసరాల పరిశుభ్రత ఒక భాగమని గుర్తించి ఆచరించినప్పుడే భవిష్యత్తు తరాలకు ఎంతో మేలు జరుగుతుందని అంబర్‌పేట సర్కిల్-16 ఏఎంహెచ్‌వో డాక్టర్ జ్యోతిబాయి అన్నారు. భోగి పర్వదినం సందర్భంగా ఆదివారం హైదర్‌గూడ, హిమాయత్‌నగర్, నారాయణగూడలో జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య మహిళ కార్మికులు తెల్లవారుజామునే రోడ్లను శుభ్రం చేసి రంగురంగుల ముగ్గులు వేసి నవధాన్యాలతో తయారు చేసిన గొబ్బెమ్మలను ముగ్గుల మధ్యలో పెట్టి భోగి వేడుకలను జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య విభాగం ఎస్ఎస్ తిరుపతి నాయక్, ఎస్ఎఫ్ఎలు ఎం. శ్రీనివాస్, సీహెచ్ సోమయ్య, సతీశ్‌చంద్ర, మధు, విష్ణు, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

బాలికపై వేధింపులు.. కేసు నమోదు

బంజారాహిల్స్, జనవరి 14: మాయమాటలతో బాలికతో పరిచయం పెంచుకుని వేధింపులకు పాల్పడిన ఓ యువకుడిపై ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఫిలింనగర్‌లోని వినాయక్‌నగర్‌లో నివాసం ఉంటున్న బాలిక (15)ను అదే ప్రాంతంలో ఉంటున్న ప్రభు మాయమాటలతో స్నేహం పెంచుకున్నాడు. ఆమెకు మొబైల్ ఫోన్ ఇవ్వడంతో పాటు తరచూ కాల్స్ చేయడం, వెంటపడి వేధించడం చేస్తున్నాడు. ఈ క్రమంలో ఇటీవల విషయాన్ని తెలుసుకున్న బాలిక కుటుంబసభ్యులు గట్టిగా నిలదీయగా జరిగిన విషయం బయటపడింది. దీంతో ఆదివారం ఫిలింనగర్ పోలీసులకు కుటుంబసభ్యులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు నిర్మాణ పనులు పరిశీలన

బన్సీలాల్‌పేట్, జనవరి 14: అరుణ్‌జ్యోతి కాలనీలో జరుగుతున్న వీడీసీసీ రోడ్డు నిర్మాణ పనులను బన్సీలాల్‌పేట్ కార్పొరేటర్ కే.హేమలత ఆదివారం పరిశీలించారు. సాయిబాబా మందిరం కమాన్ నుంచి అమ్మవారి ఆలయం వరకు జరుగుతున్న పనుల పురోగతిని జీహెచ్ఎంసీ ఏఈ నవీన్ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు లక్ష్మీపతి, శాంతికుమార్, సంధ్యారాణి, లక్ష్మీనారాయణ, నవనీత, రాణి, యాదమ్మ, అబ్బాస్, శ్రీనివాస్, కుశాల్, మురళి, నాగభూషణం, వెంకటేశ్, రుక్ముద్దీన్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

■ బీజేపీ ఆధ్వర్యంలో పతంగుల పండుగ

నెక్లెస్‌రోడ్‌లోని పీపుల్స్ ప్లాజాలో ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో పతంగుల పండుగ నిర్వహించారు. ఈ వేడుకలను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ డాక్టర్ లక్ష్మణ్‌లు స్వయంగా పతంగులను ఎగురవేశారు.

– ఖైరతాబాద్, జనవరి 14

■ క్యాలెండర్ ఆవిష్కరణ

ఖైరతాబాద్ మున్నూరుకాపు సంఘం రూపొందించి నూతన సంవత్సర 2024 క్యాలెండర్‌ను ఆ సంఘం ప్రతినిధులు శ్యామ్‌రావు, శ్రీనివాస్, రాజేశ్, ఆంజనేయులు, సర్సింగ్‌రావు, సాయిబాబు, ఉదయ్‌తో కలిసి ఆదివారం ఖైరతాబాద్‌లో ఆవిష్కరించారు.

– ఖైరతాబాద్, జనవరి 14

పద్మశాలీలు కలిసికట్టుగా పని చేయాలి

మైలార్‌దేవ్‌పల్లి, జనవరి 14: పద్మశాలీలు ఆర్థికం, రాజకీయంగా, సామాజికంగా అభివృద్ధి చెందేందుకు అందరు కలిసికట్టుగా పని చేయాలని రంగారెడ్డి జిల్లా పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి ఏర్వ సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు ఆదివారం పద్మశాలి సంఘం నూతన సంవత్సర 2024 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అత్తాపూర్ డివిజన్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు నర్సింహులు, ప్రధాన కార్యదర్శి కృష్ణ , కోశాధికారి బండారి శ్రీనివాస్, యూత్ ప్రెసిడెంట్ బండారి వేణుగోపాల్, రాజేంద్రనగర్ డివిజన్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు రాపోలు సత్తయ్య, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కాశీగారి యాదగిరి, రంగారెడ్డి జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి కొంపల్లి జగదీశ్, తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణపై ప్రచారం చేస్తున్న సీఐ శ్రీనాథ్, తదితరులు

నేరాల నియంత్రణకు చర్యలు

శంషాబాద్ రూరల్, జనవరి 14: నేరాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు శంషాబాద్ రూరల్ సీఐ శ్రీనాథ్ తెలిపారు. ఆదివారం శంషాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వివిధ గ్రామాల్లో ఆటోల ద్వారా నేరాల నియంత్రణ చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. సంక్రాంతి పండుగకు ఊర్లోకు వెళ్ల వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. నేరాలు జరగకుండా గస్తీ పెంచుతామని, వారం రోజుల పాటు పోలీసులు నేరాలు నియంత్రణ చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.